

పక్కాగా ఓటరు జాబితా తయారీ

జిల్లాలో స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. - 8లో



ఓటమి భయంతో అవాస్తవ ఆరోపణలు

టీడీపీ నేతలు ఓటమి భయంతో ప్రభుత్వంపై అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పేర్కొన్నారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	32	24
తిరుపతి	33	24
తిరుమల	28	20
గూడూరు	33	26
నగరి	33	24

న్యూస్‌రీల్

10లోపు బయోమెట్రిక్ చేసుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్, మెరిట్‌కం మీన్స్ స్కాలర్‌షిప్ పథకాలకు దరఖాస్తు చేసుకున్న విద్యాసంస్థల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు ఈనెల 10వ తేదీ లోపు ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి చిన్నారెడ్డి తెలిపారు. మైనారిటీ విద్యార్థుల ఉపకార వేతనాల పంపిణీకి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ ద్వారా విద్యాసంస్థలు, లబ్ధిదారుల భౌతిక ధ్రువీకరణ ఫలితాల పరిశీలనలో వివిధ వ్యత్యాసాలు గుర్తించారన్నారు. దీంతో తిరిగి దరఖాస్తులను ధ్రువీకరించాలని నిర్ణయించారని తెలిపారు. స్కాలర్‌షిప్‌ల మొత్తం సత్వర పంపిణీకి ఆధార్ నంబర్ బ్యాంక్ ఖాతాతో అనుసంధానం అయ్యిందా అని నిర్ధారించుకోవాలన్నారు. scholarships. gov.in పోర్టల్‌లో సూచించిన మార్గదర్శకాలను పరిశీలించి ఈ నెల 10 లోపు బయోమెట్రిక్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. దరఖాస్తుదారుడు 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నట్లైతే తల్లిదండ్రుల/సంరక్షకుల ఆధార్ నంబర్ అప్‌డేట్ చేయాలని చెప్పారు. ఇతర వివరాలకు 7382781316 నంబర్‌లో సంప్రదించవచ్చని కోరారు.

నేడు పూతలపట్టులో బాబు రోడ్‌షో

చిత్తూరు అర్బన్: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు, పూతలపట్టు పర్యటన ఖరారయ్యింది. శుక్రవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె నుంచి సాయంత్రం 3.30 గంటలకు చిత్తూరు శివారుల్లోని కాణి పాకం బైపాస్ వద్ద ఉన్న బాన్స్ హోటల్‌కు చేరుకుంటారు. పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి, మీడియాతో మాట్లాడుతారు. 4.30 గంటలకు పూతపట్టుకు చేరుకుని గంట పాటు రోడ్‌షో నిర్వహిస్తారు. 5.30 గంటలకు పూతలపట్టు అంబేడ్కర్ విగ్రహం వద్ద బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అక్కడి నుంచి గాజులమండ్యం కూడలి మీదుగా రేణిగుంట చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు.

వైఎస్సార్ లైఫ్ టైమ్ అవార్డులకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్ లైఫ్ టైం అవార్డులకు అర్హత ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవచ్చని యువజన సర్వీసుల శాఖ సీఈవో మురళీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023 సంవత్సరానికి సంబంధించి అవార్డుల ప్రదానానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. కళలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ట్రేడ్ అండ్ ఎడ్యుకేషన్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీసెస్, క్రీడలు తదితర రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, సొసైటీలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తమ ప్రతిభను ఒక పేజీలో క్లుప్తంగా తెలియజేస్తూ ఈ మెయిల్ వివరాలను సమర్పించాలని తెలిపారు. ఈనెల 20 వ తేదీలోపు దరఖాస్తులను incentives. schemes @gmail. comకు పంపాలని సీఈవో వివరించారు.

నేడు కుప్పం, పుంగనూరు అభివృద్ధిపై సమీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల అభివృద్ధిపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు కుప్పం, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుంగనూరు నియోజకవర్గాల సమావేశాలు ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, భవనాలు, రోడ్లు, హౌసింగ్, గడపగడపకు మన ప్రభుత్వం, ఇతర అంశాలపై సమీక్ష ఉంటుందని తెలిపారు. ఈ సమావేశాలకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. ఆయా శాఖల అధికారులు సమావేశాలకు ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

నేడు సంకటహర చతుర్థి వ్రతం

కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం సంకటహర చతుర్థి గణపతి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. పౌర్ణమి తరువాత వచ్చే నాలుగో రోజు ఆలయంలో సంకటహర చతుర్థి గణపతి వ్రతం నిర్వహించడం ఆనవాయితీ. భక్తుల సౌకర్యార్థం ఈ వ్రతాన్ని ఉదయం 10 గంటలకు, సాయత్రం 6 గంటలకు రెండు విడతలుగా నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు స్వర్ణ రథంపై స్వామివారు తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షిస్తారని చైర్మన్, ఈఓ తెలిపారు.

చంద్ర ద్రోహం

14 ఏళ్ల ముఖ్యమంత్రి, 40 ఏళ్ల రాజకీయ ఇండస్ట్రీ అని చెప్పుకునే నారా చంద్రబాబునాయుడు తన సొంత జిల్లా ఉమ్మడి చిత్తూరుకు తీరని అన్యాయం చేశారు. తనకు రాజకీయ భిక్షపెట్టిన కుప్పం నియోజకవర్గ ప్రజలనూ నిట్ట నిలువునా ముంచేశారు. కృష్ణా జలాలు కుప్పానికి తీసుకొస్తానంటూ ప్రగల్భాలు పలికి తన అనుచరులకు దోచిపెట్టి మధ్యలోనే పనులు ఆపేశారు. ఇప్పుడు అధికార లేమితో మరో మారు పేట్రేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులకూ అడుగడుగునా అడ్డు తగులుతూ రాక్షసానందం పొందుతున్నారు. ఇందులో భాగంగానే 'ప్రాజెక్టుల పరిశీలన..యుద్ధభేరి' అంటూ మేగపోతు గాంభీర్యాలు పలుకుతూ జిల్లా పర్యటనకు శ్రీకారం చుడుతున్నారు. 'బాబూ నీకో దండం.. నువ్వు రావొద్దు స్వామీ' అంటూ ఆయన హయాంలో ఎదురైన ఇబ్బందులను గుర్తుచేసుకుని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

- కుప్పం నియోజకవర్గానికి చంద్రబాబు తీరని అన్యాయం
- కుప్పం బ్రాంచ్ కెనాల్ పేరుతో విచ్చలవిడిగా దోపిడీ
- పాలారు, ఆవులపల్లి, నేతిగుట్లపల్లె, ముదివేడు ప్రాజెక్టులను అడ్డుకున్న వైనం
- రూ.7,400 కోట్ల కేంద్ర నిధులకు అడ్డుపుల్ల వేసిందీ మీరే!
- నేటి నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చంద్రబాబు పర్యటన

సాక్షి, తిరుపతి: చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పం వాసులకు సాగు, తాగునీరు అందివ్వలేకపోయారు. సీఎం హోదాలో జిల్లాకు వచ్చిన ప్రతిసారీ కృష్ణా జలాలను కుప్పానికి తీసుకొస్తానంటూ స్థానికుల చెవిలో పూలుబెట్టి మోసగించారు. హంద్రీ–నీవా ప్రాజెక్టులో భాగమైన కుప్పం ఉపకాలువ పనులు తన ముఖ్య అనుచరుడు, భాగస్వామి సీఎం రమేష్ (నాడు టీడీపీ.. నేడు బీజేపీ) కాంట్రాక్టు సంస్థకు అప్పగించి కోట్ల రూపాయలు దోచిపెట్టారు. 31 నెలలు కాంట్రాక్టు గడువును పెంచడమే కాకుండా.. ఒప్పందానికి మించి అదనంగా రూ.144 కోట్లను మంజూరు చేసి జేబులు నింపే ప్రయత్నం చేశారు.



ఆగిన హంద్రీ-నీవా కాలువ నిర్మాణం

దోచిపెట్టి..గొంతు ఎండబెట్టి!

చిత్తూరు జిల్లా, పలమనేరు నియోజకవర్గం, పెద్ద పంజాణి మండలంలోని అప్పినపల్లె చెరువు నుంచి కుప్పంలోని పరమసముద్రం చెరువు వరకు 143.9 కిలోమీటర్ల కాలువ పనులు, మూడు ఎత్తిపోతల పథకాలు, మధ్యలో కాంక్రీటు నిర్మాణాల కోసం 2015లో రూ.413 కోట్లతో టెండర్లు నిర్వహించారు. 4 శాతం ఎక్సెస్‌తో రూ.430.27 కోట్లకు టెండర్ వేసిన హెచ్‌ఈఎస్-ఆర్‌కే-కోయా జాయింట్ వెంచర్ పనిచేపట్టాక అప్పటి టీడీపీ ఎంపీ సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్ కాంట్రాక్టు సంస్థకు పనుల్లో భాగస్వామ్యం కల్పిస్తూ చంద్రబాబు ఉత్తర్వులిప్పించారు. ఈ పనులను 2016 జనవరి 4 నుంచి 2016 అక్టోబర్ 3 నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. ఆ గడువు లోపు పనులు చేయకపోవడంపై చర్యలు తీసుకోవాల్సిన చంద్రబాబు ప్రభుత్వం సదరు కాంట్రాక్టు సంస్థకు అనుకూలంగా 2016 అక్టోబర్ 4 నుంచి 2019 ఏప్రిల్ 30వ తేదీ వరకు ఐదుసార్లు గడువు పెంచారు. ఈ క్రమంలో 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి రూ.85.05 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పనులు పూర్తిచేయాలని నోటీసులు జారీ చేసినా సదరు కాంట్రాక్టు సంస్థ ఖాతరు చేయక పోవడంతో 60సీ కింద ఆ సంస్థను తప్పించాల్సి వచ్చింది.

కుప్పం కాలువపై జగన్ చొరవ

కుప్పం కేబీసీ పనులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరుగులు పెట్టిస్తున్నారు. 1.10 టీఎంసీల నీటిని తరలించేందుకు రూ.430.27 కోట్లతో చేపట్టిన ఈ కాలువ పలమనేరు నియోజకవర్గం, పెద్దపంజాణి మండలం అప్పినపల్లె చెరువు వద్ద ప్రారంభమై.. కుప్పం నియోజకవర్గం పరమసముద్రం చెరువులో కలుస్తుంది. 6,300 ఎకరాలకు సాగు, 4.05 లక్షల మందికి తాగు నీరు అందించనుంది.



చిత్తూరుకు బాబు వెన్నుపోటు



ఉమ్మడి చిత్తూరు జిల్లా తాగునీటి అవసరాల కోసం కేంద్రం మంజూరు చేసిన నిధులు రాకుండా నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు పక్కదారిపట్టించారు. రూ.7,400 కోట్లతో కండలేరు జలాశయం నుంచి శ్రీకాళహస్తి, తిరుపతి, చిత్తూరు, మదనపల్లికి నీరందించే బృహత్తర పథకాన్ని రద్దు చేశారు. కండలేరు నుంచి 6.61 టీఎంసీల నీరు తరలింపునకు టెండర్ నిర్వహిస్తే దాన్ని కూడా రద్దు చేసి జిల్లాకు తీరని అన్యాయం చేశారు. ఇలా గత టీడీపీ హయాంలో తన సొంత జిల్లాను పట్టించుకోకుండా ఎడారిగా మార్చేశారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో తన వైఫల్యాలు, నిర్లక్ష్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు వస్తున్న చంద్రబాబుపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఈ పాపాలు గుర్తులేవా బాబు?

- టీడీపీ హయాంలో ఒప్పంద విలువ కంటే అదనంగా రిత్విక్ ప్రాజెక్ట్ కాంట్రాక్టు సంస్థకు రూ.287 కోట్లు కట్టబెట్టారు.
- అదనంగా మట్టి పనులు చేశామని రూ.160 కోట్లు చెల్లించేలా అధికారులు చేసిన ప్రతిపాదనను స్టేట్‌లెవల్ స్టాండింగ్ కమిటీ తిరస్కరించింది.
- కాంక్రీటు నిర్మాణాలకు మాత్రమే అదనంగా చెల్లిస్తామని ఎస్‌ఎల్‌ఎస్‌సీ నిర్ణయం తీసుకోగా రూ.122.75 కోట్లు మంజూరు చేస్తూ 2018 సెప్టెంబర్ 7న జీవో నం.626 జారీచేశారు. కుప్పం కాలువ గట్లమీద మట్టిపనులు చేశారని 2019 జనవరి 28న జీవో నం.68 జారీచేసి మరో రూ.21.95 కోట్లు అదనంగా మంజూరు చేశారు.
- మొత్తంగా టీడీపీ సర్కార్ రిత్విక్ ప్రాజెక్టు కాంట్రాక్ట్ సంస్థకు అదనంగా రూ.144.7 కోట్లు దోచిపెట్టింది. ఈ దోపిడీ కోసం ప్రత్యేకంగా జీవో నం.32 తీసుకొచ్చింది. దీంతో కుప్పం కాలువ పని విలువ రూ.574.96 కోట్లకు చేరింది.

గంతులేసి.. చేతులు తడిపి

ఎన్నికలు సమీపిస్తుండడంతో 2019 జనవరి 21 నుంచి ఏప్రిల్ 11 వరకు కృష్ణా జలాలను ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పెద్ద తిప్పసముద్రం మండలం నుంచి ప్రారంభమయ్యే పుంగనూరు ఉప కాలువకు మళ్లించారు. కాలువను కేవలం తడిపించి నీటిని విడుదల చేశామని ప్రకటించుకున్నారు. పలమనేరు నియోజకవర్గంలోని అప్పినపల్లె నుంచి 43వ కిలోమీటరులోని వి.కోట మండలం, నార్నిపల్లె వరకు జలాలు సాగి ఆగిపోయాయి. అయితే కుప్పం నియోజకవర్గంలోకి చుక్కనీరు దిగలేదు.



గాలేరు–నగరిని గాల్లో కలిపేశావ్?



గాలేరు–నగరి ప్రాజెక్టుకు 1995 నుంచి 2004 వారకు చంద్రబాబు ఖర్చు చేసింది కేవలం రూ.17.52 కోట్లు. అవి కూడా ఆఫీస్ నిర్వహణ కోసం. వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గాలేరు–నగరి కోసం రూ.4283.08 కోట్లు వెచ్చించారు. దీన్నిబట్టే తెలుస్తోంది.. బాబుకు తన సొంత జిల్లాపై ఎంత ప్రేమ ఉందో..?

ప్రాజెక్టులకు బాబు అడ్డుపుల్ల

చిత్తూరు జిల్లాలోనే చాలా వెనుకబడిన ప్రాంతాలైన పుంగనూరు, పీలేరు, మదనపల్లి, కుప్పం, పలమనేరు, తంబళ్లపల్లి ప్రాంతాలకు నీరందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. ఇందులో భాగంగా ఆవులపల్లి, నేతిగుంటపల్లి, ముదివేడు రిజర్వాయర్లతో ఆయా నియోజకవర్గాల్లోని చెరువులకు నీరు నింపేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందులో భాగంగా సుమారు రూ.1,600 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు. అనంతపురం వాసులకు ఇబ్బంది లేకుండా తన సొంత నియోజకవర్గంలోని గండికోట రిజర్వాయర్ ద్వారా నికర జలాలను చిత్తూరు జిల్లాలోని ఆయా ప్రాంతాలకు ఇచ్చేందుకు ఆలోచన చేశారు. అయితే ఇందులో రూ.2,600 కోట్లు అవినీతి జరిగిందని, పర్యావరణ అనుమతులు లేవంటూ బాబు తన అనుచరుల ద్వారా గ్రీన్ ట్రిబ్యునల్‌ని ఆశ్రయించి అడ్డుకున్నారు.



పుంగనూరు మండలం, నేతిగుట్లపల్లె వద్ద ఆగిపోయిన ప్రాజెక్టు

పాలారు..నిన్నొదిలేశారు!

కుప్పం నియోజకవర్గ పరిధిలోని 4వేల ఎకరాలకు సాగు, నాలుగు మండలాలకు తాగు నీటి అవసరాలను తీర్చేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి పాలారు ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయించారు. అందులో భాగంగా రూ.55 కోట్లు కేటాయించారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే ఆయనకు ఎక్కడ పేరొస్తుందని చంద్రబాబు 2006లో తమిళనాడు వాసులను రెచ్చగొట్టి కోర్టును ఆశ్రయించి ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకున్నారు. తిరిగి పాలారు ప్రాజెక్టును నిర్మించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. రిజర్వాయర్ నిర్మాణానికి రూ.300 కోట్లమేర అధికారులు అంచనాలు సిద్ధం చేశారు.



పాలారు ప్రాజెక్టు నిర్మించే ప్రాంతం

ఇవి చాలా..ఇంకా లెక్కలు కావాలా?

- పథకాల లబ్ధి పొందినా లేదని టీడీపీ నేతల ప్రచారం
- పథకాల లబ్ధి వివరాలను అంకెలతో వివరించిన ఎమ్మెల్యే
- పరువు పోయి.. ముఖం చాటేసిన టీడీపీ

పూతలపట్టు(యాదమరి): పథకాల లబ్ధి అందుకుని కూడా లేదని టీడీపీ నేతలు అవాస్తవ ప్రచారం చేయడం పూతలపట్టులో చర్చనీయాంశమైంది. అర్హతే ప్రామాణికంగా కులాలు, మతాలు, పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. పథకాల లబ్ధి పొందిన వారిలో టీడీపీ నాయకులు కూడా ఉన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఎవరెంత లబ్ధి పొందారో వివరాల సహా వివరిస్తున్నారు. దీంతో టీడీపీ నాయకుల వెన్నులో వణుకు పడుతోంది. ఎలాగైనా ప్రభుత్వంపై బురదచల్లాలని అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారు. గురువారం పూతలపట్టు పంచాయతీలోని కొత్తూరులో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రతి గడపకు వెళ్లి పథకాల లబ్ధిని వివరించారు. టీడీపీ నాయకుడు నాగరాజునాయుడు ఇంటి వద్దకు వెళ్లి మీ కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.1.67 లక్షలు లబ్ధి చేకూరిందని సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లోని వివరాలను వెల్లడించారు. ఎమ్మెల్యే వెళ్లిన తరువాత తమ పార్టీ ముఖ్య నేతలను కలసి 'నా ఖాతాలో జమ కాలేదు..మాకుటుంబ సభ్యుల పేరుతో లబ్ధి అందింది.. కావాలనే నాకు ప్రభుత్వ పథకాలు అందాయని' నాగరాజునాయుడు విన్నవించారు. శుక్రవారం తమ పార్టీ అధినేత చంద్రబాబు పర్యటన ఉండడంతో టీడీపీ మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, పూతలపట్టు నియోజక వర్గ ఇన్‌చార్జ్ మురళీ మోహన్, పులివర్తినాని వెంటనే విలేకరుల సమావేశాలు నిర్వహించి రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఎమ్మెల్యేను విమర్శిస్తూ పథకాలు ఇవ్వకనే ఇచ్చినట్లు కరపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తున్నారని విమర్శల వర్షం కురిపించారు. నాగరాజు నాయుడు కుటుంబానికి రూ.42 వేలు మాత్రమే అందాయని చెప్పారు. కానీ అసలు విషయం తెలుసుకుని తెల్లముఖం వేసుకోవడం వారి వంతు అయింది.



ప్రభుత్వ పథకాలు మీకు అందాయని టీడీపీ నేత నాగరాజు నాయుడుకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు



నాగరాజు కుటుంబానికి ప్రభుత్వం ద్వారా అందిన పథకాల వివరాలు

పథకం	లబ్ధిదారు	సంవత్సరం	లబ్ధి
వైఎస్సార్ ఆసరా	పావని (నాగరాజు భార్య)	2020-21	రూ.9,207
		2021-22	రూ. 9,207
		2022-23	రూ.9,207
		మొత్తం	రూ.27,621
అమ్మ ఒడి	పావని	2019-20	రూ.15,000
		2020-21	రూ.14,000
		2021-22	రూ. 13,000
		2022-23	రూ.13,000
		మొత్తం	రూ.55,000
సున్నా వడ్డీ	పావని	2020-21	రూ.2,574
		2021-22	రూ.2,103
		2022-23	రూ.2,256
		మొత్తం	రూ.6,933
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	ఎం.మోహిత్ (కుమారుడు)	2020-21	రూ.30,580
	ఎం.తేజ (కుమారుడు)	2020-21	రూ.33,840
రైతు భరోసా	పావని (భార్య)	2019-20	రూ.13,500
నాగరాజునాయుడు లబ్ధి పొందిన పథకాల నగదు			రూ.1,67,474

ఇదీ పథకాల లబ్ధి

నాగరాజునాయడు కుటుంబంలో ఆయన భార్య ఎం. పావని, కుమారులు ఎం.మోహిత్, ఎం.తేజకు పూతలపట్టు సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో వివిధ పథకాల కింద రూ.1,67,474 జమ అయ్యింది.

జగనన్న సురక్ష నభూతో నభవిష్యత్

- పారదర్శకతకు జగనన్న ట్రెండ్‌సెట్టర్
- 93 లక్షల మందికి ఉచితంగా సర్టిఫికెట్లు
- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా



మంత్రి ఆర్కేరోజా

నగరి : జగనన్న సురక్ష నభూతో నభవిష్యత్ అని, పారదర్శక పాలనకు ట్రెండ్‌సెట్టర్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. గురువారం నగరి పట్టణంలోని స్వగృహంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికలు జరిగే వరకే రాజకీయం ఆపై అందరూ మనవాళ్లే, అందరికీ మంచిచేయాలి అని జగనన్న ప్రజాసంకల్ప యాత్రలో చెప్పారని, అది అక్షరాల నేడు అమలు చేస్తున్నారని తెలిపారు. జగనన్న సురక్ష ప్రజలకు శ్రీరామరక్షగా మారిందన్నారు. కోటీ నలభై రెండు లక్షల మంది ఇళ్లను సర్వేచేసి, వారి అవసరాలు గుర్తించి, 93 లక్షల మందికి 11 రకాల సర్టిఫికెట్లు రూపాయి ఖర్చు లేకుండా అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి విజన్ ఏమిటో అందరికీ అర్థమైందన్నారు. పాదయాత్రలో చెప్పినట్లు ప్రజల కష్టాలు దూరంచేసేలా ఇటు సంక్షేమం, అటు అభివృద్ధి చేస్తూ జగనన్న సురక్ష ద్వారా సర్టిఫికెట్లు అందించిన తీరు నభూతో నభవిష్యత్ అని తెలిపారు. దేశంలో ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేయ లేని కార్యక్రమాన్ని జగనన్న చేశారని, ఇది గర్వకారణమన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ప్రజా సేవకు ఎన్నో వ్యవస్థలు వచ్చాయని, వాటన్నింటినీ సచివాలయ వ్యవస్థ అధిగమించిందని పేర్కొన్నారు. నగరి నియోజకవర్గంలో 88 జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తే 44,577 మంది వివిధ దరఖాస్తులు చేసుకున్నారని, 43,119 మంది సర్టిఫికెట్లు పొందారని తెలిపారు. ఇది సమర్థవంతమైన పాలనకు ఆధారపూరిత నిదర్శనమన్నారు.



ఆడికృత్తిక వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

కార్వేటినగరం: ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం పెనుమూరు మండలం కలికిరి కొండపై కార్వేటినగరం శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయ ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను ఆలయ అధ్యక్షుడు కే.కేశవరెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మాజీ మంత్రి యల్లంపల్లి శ్రీనివాసులు చొరవతో నియోజకవర్గంలో అనేక ఆలయాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సుబ్రమణ్యస్వామి ఆలయంలో నేటి వరకు రాజగోపురం, ప్రహరీ గోడ నిర్మాణానికి రూ. 50 లక్షలు, ఫ్లోరింగ్ నిర్మాణానికి రూ.35 లక్షలు మ్యాచింగ్ గ్రాంట్ కాకుండా ప్రభుత్వ నిధులతో ఆలయాన్ని అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డి చొరవతో దాతల సహకారంతో సుమారు రూ. 40 లక్షలతో ఆలయంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారని మంత్రి అభినందించారు. కేశవరెడ్డి మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ నుంచి ఆడికృత్తిక వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి,నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేడుకగా కలశ ప్రతిష్ట


కలిశాలను ప్రతిష్టిస్తున్న అర్చకులు

చౌడేపల్లి:పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయ సమీపంలోని శ్రీరణభేరి గంగమ్మ ఆలయ గాలిగోపురంపై గురువారం కలశాలను పునఃప్రతిష్ఠించారు. బోయకొండ ఆలయ ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో వాయిల్పాడుకు చెందిన దాత రఘురామిరెడ్డి సహకారంతో అర్చకులు వేదోక్తంగా కలశాలను ప్రతిష్టించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

దైవ దర్శనానికి వెళుతుండగా..

– కారు ఢీకొని యువకుడు మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సురేంద్ర (28) అనే యువకుడు మృతి చెందాడు. బంగారుపాళ్యం మండలం ముంగరమడుగుకు చెందిన సురేంద్ర స్నేహితుడు శివకుమార్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై తిరుమల శ్రీవారి దర్శనానికి బయలుదేరాడు. చిత్తూరు సమీపంలోని చెర్లోపల్లి వద్ద స్వామివారి ముడుపు నుంచి చిల్లర నాణేలు కింద పడ్డాయి. వాహనం ఆపి చిల్లర తీసుకుంటుండగా వెనకనుంచి వచ్చిన ఓ గుర్తు తెలియని కారు బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో సురేంద్ర అక్కడికక్కడే మృతి చెందగా, శివకుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిప్యుటేషన్ల దందా

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డిప్యుటేషన్ల దందా సాగుతోంది. గుట్టు చప్పుడు కాకుండా 15మందికి అనధికారికంగా డిప్యుటేషన్లు ఇచ్చినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు జరిగితే..ఇదే అదునుగా ఇద్దరు అధికారులు రెచ్చిపోయారు. రూ.50 వేలు వసూలు చేసి ఇష్టానుసారంగా డిప్యుటేషన్లు ఇచ్చారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ డిప్యుటేషన్ల గోలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది.

- డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఇష్టానుసారంగా డిప్యుటేషన్లు
- చక్రం తిప్పుతున్న ఇద్దరు అధికారులు
- ప్రతి డిప్యుటేషన్‌కు రూ. 50వేలు ?
- ఉన్నతాధికారులకు ఫిర్యాదుల పరంపర


డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం

చిత్తూరు రూరల్: డిప్యుటేషన్ల పేరుతో డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో పలు అవకతవకలు జరుగుతున్నట్లు ఆ శాఖ అధికారులే పెదవి విరుస్తున్నారు. కార్యాలయంలో 40 మందికి పైగా వివిధ స్థాయిల్లో ఉద్యోగులు పనిచేస్తున్నారు. బిల్లులు, ఇతరాత్ర సయయంలో కొందరు సిబ్బందిని డిప్యుటేషన్ల విధానం ద్వారా పీహెచ్‌సీల నుంచి కార్యాలయానికి పిలిపించుకుంటారు. ఇందుకు ఉన్నతాధికారుల ఆదేశాలు తప్పనిసరిగా కావాలి. ఒకరిద్దరిని మాత్రమే డిప్యుటేషన్లకు అనుమతి తీసుకుని, ఉన్నతాధికారులే తెలియకుండా గత నెలలో 15 మందికి వరకు డిప్యుటేషన్లు ఇచ్చినట్లు విమర్శలు వెలువెత్తుతున్నాయి. వర్క్ ఆర్డర్ పేరుతో తమకు అనుకూలంగా ఉన్న వారికే డిప్యుటేషన్లు వేస్తూ కొందరు అధికారులు కార్యాలయానికి రప్పించుకుంటున్నట్లు సమాచారం. వారం రోజులంటూ నెలల తరబడి కొనసాగిస్తున్నారు. ఇచ్చిన ఆర్డర్లల్లో కూడా సరైనా స్పష్టత ఉండడం లేదు. ఉన్నతాధికారుల పేరు చెప్పి డిప్యుటేషన్లు వేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ప్రశ్నిస్తే వారి నోరు మూయించే ప్రయత్నం చేస్తున్నారు. డిప్యుటేషన్ల పేరిట రూ. 50 వేల వరకు కొందరు వసూలు చేస్తునట్లు ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ విషయంలో ఇద్దరు అధికారులు చక్రం తిప్పుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి.

ఇవిగో సాక్ష్యాలు..

- పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఓ సిబ్బందిని బిల్లులు, పోస్టుల భర్తీ విషయానికి సంబంధించి డిప్యుటేషన్ పేరుతో డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయానికి రప్పించుకున్నారు. ఈ పని పూర్తయింది..కానీ ఆ సిబ్బంది కార్యాలయంలోనే పాతుకుపోయాడు. అధికారులు అతన్ని వెనక్కి పంపించే ప్రయత్నం చేయలేదు.
- అలాగే డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో మూడు రోజులు పనిచేసేలా.. సీహెచ్‌సీలో పనిచేస్తున్న ఓ ద్వితీయ శ్రేణి ఉద్యోగికి డిప్యుటేషన్ వేశారు. ఆయన ఆరు రోజులుగా కార్యాలయంలోనే తిష్ట వేసి ఉన్నారు. సీహెచ్‌సీకి వెళ్లడానికి ముఖం చాటేశారు. ఆ శాఖ అధికారి అండదండలతో ఈతంతు కొనసాగుతోందని ఆ విభాగంలో పనిచేసే అధికారులే గుర్రుమంటున్నారు.

కచ్చితంగా చర్యలు తీసుకుంటాం

జిల్లా యంత్రాంగం ఆదేశాలమేరకు బిల్లులు, పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేసేందుకు డిప్యుటేషన్లకు అనుమతి తీసుకున్నాం. ఆ ఆర్డర్లో నాకు తెలియకుండా ముగ్గురు పేర్లను పెట్టారని 15 రోజులకు కిందట ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓగా పనిచేసిన రాజశేఖర్‌రెడ్డి వివరణ ఇచ్చారు. నేను 10 రోజుల కిందటే విధులు చేపట్టాను. డిప్యుటేషన్లు ఎలా జరిగాయో నాకు తెలియదు. ఈ విషయంలో అవకతవకలు ఉంటే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. **– ప్రభావతి, డీఎంఅండ్‌హెచ్‌ఓ**

భార్య మృతి కేసులో భర్త అరెస్టు

చిత్తూరు అర్బన్: భార్యమృతికి కారణమైన భర్తను గురువారం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ మద్దయ్య వివరాల మేరకు.. చిత్తూరు నగరం దుర్గానగర్ కాలనీకి చెందిన లావణ్య (30) మూడు రోజుల క్రితం మృతి చెందిన విషయం విధితమే. గిరింపేటలో వడ్డెర పనిచేసే కుమార్ (36) దుర్గానగర్ కాలనీకి చెందిన లావణ్య ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. తల్లిదండ్రులు చనిపోవడంతో లావణ్యను అమ్మమ్మ శాంతి పెంచి పోషించింది. అమ్మమ్మ పేరుతో ఉన్న ఓ ఇల్లును కుమార్ తన పేరుతో రాయించుకోవాలని గత కొన్ని రోజులుగా లావణ్యతో గొడవ పడుతున్నా డు. గతనెల 27వ తేదీ లావణ్యతో గొడవపడి దు ర్గానగర్ చెరువు వద్దకు తీసుకెళ్లి చితకబాదాడు. మనస్తాపానికి చెందిన లావణ్య చెరువులో పడి చనిపోయింది. మూడు రోజుల తర్వాత లావణ్య మృతదేహం చెరువులో తేలింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భర్త వేధింపులతో చనిపోయినట్లు నిర్ధారించి కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు.

వివాహిత అదృశ్యం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మండలం తొప్పాతిపల్లెకు చెందిన వివాహిత వాణి (37) అదృశ్యం అయింది. నాలుగు రోజుల కిందట బంగారుపాళ్యం మండలం సంక్రాంతిపల్లెలోని తన తల్లి వద్దకు వెళతానని చెప్పి వెళ్లిన వాణి.. అక్కడికి వెళ్లలేదు. బంధువుల ఇళ్లలో, పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిత్తూరు తాలూకా ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటమి భయంతో అవాస్తవ ఆరోపణలు

- పథకాలు అందుకున్నా లేదని టీడీపీ నేతల విషప్రచారం
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు : జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత కులాలు చూడలేదు, మతాలు చూడలేదు అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పేర్కొన్నారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు జిల్లా పర్యటనకు వస్తున్నారని మెప్పు కోసం కావాలనే అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నేతలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నా ప్రజలను తప్పుదారి పట్టించేలా ప్రకటనలు చేస్తున్నారని పేర్కొన్నారు. పూతలపట్టు మండలం కొత్తూరు గ్రామంలో టీడీపీ నేత నాగరాజు కుటుంబ సభ్యులకు రూ.1.67 లక్షలు ప్రభుత్వ పథకాల ద్వారా అందించామన్నారు. వారి కుటుంబ సభ్యుల పేరుతో బ్యాంకులో నగదు జమ అయినా, పథకాల లబ్ధి తనకు అందలేదని నాగరాజునాయుడు మూర్ఖంగా మాట్లాడడం, టీడీపీ నాయకులు విలేకరుల సమావేశం పెట్టి లబ్ధి అందలేదని చెప్పడం చూస్తుంటే వారికి ఓటమి భయం పట్టుకుందని స్పష్టంగా తెలుస్తోందని విమర్శించారు. పథకాలు అర్హులందరికీ అందించాము కాబట్టే ధైర్యంగా ప్రజల్లోకి వెళుతున్నామని తెలిపారు. చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన పేరుతో తిరుగుతూ మతి భ్రమించి పూతలపట్టులో ప్రాజెక్టు ఉందని వస్తున్నారని, కానీ పూతలపట్టు నియోజక వర్గంలో ఎక్కడ ప్రాజెక్టులు లేవని విమర్శించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, నాయకులు జగదీశ్వర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబితా తయారీ

- సర్వేలో బీఎల్‌వోల పాత్ర ముఖ్యం
- బాధ్యతగా సర్వే నిర్వహించాలి
- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులు, బీఎల్‌వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఓటరు జాబితా సమర్థవంతంగా ఉన్నప్పుడే ఎన్నికలు సజావుగా సాగుతాయని తెలిపారు. మృతి చెందిన వారి ఓట్లను మరణ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా తొలగించాలన్నారు. ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా జాబితా తయారు కావాలని తెలిపారు. ఈనెల 8వ తేదీ లోపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలు ఇచ్చిన జాబితా మేరకు బీఎల్‌ఏల నియామకం జరిగిందన్నారు. బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ఇంటింటి పరిశీలన సమయంలో బీఎల్‌ఏలను తీసుకెళ్లాలని అన్నారు. ఓటర్ల మార్పులు, చేర్పులు, తీసివేతలకు సంబంధించిన డాక్యుమెంట్లను తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం ఓటర్ల నమోదు కార్యక్రమం జనవరి 5, 2023 జాబితా ప్రకారం జరగుతోందని, సప్లిమెంటరీగా ఏప్రిల్, జూలై నెలలో విడుదల చేసిన జాబితాలను పరిశీలించాల్సి ఉంటుందని తెలిపారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారికి కూడా ఓటు హక్కు కల్పించాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం 80 సంవత్సరాలు పైబడిన వారికి ఇంటి నుంచే ఓటు వేసే విధానం చేపట్టాలని పరిశీలిస్తోందని తెలిపారు. ఈ కసరత్తులో తగిన జాగ్రత్తలతో వారి వివరాలు పొందుపరచాలని చెప్పారు. ఇతర దేశాల నుంచి వచ్చి ఓటు హక్కు కావాలని భావించే వారి నుంచి ఆధార్ కార్డుతో పాటు ఇతర అర్హతల ధ్రువపత్రాలను తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండలాల వారీగా బీఎల్‌వోలకు కసరత్తుపై అవగాహన కల్పించారు. డీఆర్‌వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌డీసీ భవానీ, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి రూ.10వేల పింఛన్


పింఛన్ అందజేస్తున్న నాయకులు, వలంటీర్

కుప్పంరూరల్: అడగకుండా అమ్మ అయినా అన్నం పెట్టదంటారు. కానీ అడగకుండానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అన్ని ఇస్తున్నారనేందుకు ఇదో ఉదాహరణ. కుప్పం మండలం, దాసేగౌనూరు పంచాయతీ గుట్టపల్లె కాలనీకి చెందిన తాజా మాజీ సర్పంచ్ సుబ్బలక్ష్మమ్మ భర్త కృష్ణమూర్తి మూడు నెలలుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాలలో చికిత్స పొందుతున్నాడు. అక్కడ ఆస్పత్రి యాజమాన్యం కృష్ణమూర్తి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని, ఇతను పెన్షన్‌కు అర్హుడని ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టారు. దరఖాస్తు పరిశీలించిన ప్రభుత్వం అతనికి పెన్షన్ మంజూరు చేసింది. పదిహేను రోజుల్లోన్నే కృష్ణమూర్తికి పెన్షన్ మంజూరైంది. ఆగస్టు నెలకు సంబంధించిన రూ.10వేల పెన్షన్ గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మురుగేష్, వలంటీర్ల సహకారంతో కృష్ణమూర్తికి అందజేశారు. దరఖాస్తు చేసిన వెంటనే పింఛన్ రావడంతో కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

6న ఉభయదారుల సమావేశం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలపై ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఉభయదారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. దేవస్థానం అనుబంధ శ్రీమణికంఠేశ్వర స్వామి ఆలయంలో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఆలయ అధికారులు, ఉభయదారులు తప్పక హాజరు కావాలని కోరారు.

‘చాట్‌బోట్’ సూపర్ సక్సెస్

- రూ.45 లక్షల విలువైన సెల్‌ఫోన్లు స్వాధీనం
- 200మంది బాధితులకు అందజేత


మాట్లాడుతున్న ఏఎస్పీ సుధాకర్, సీజ్ చేసిన మొబైల్ ఫోన్లు

చిత్తూరు అర్బన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను కనుగొనేందుకు చిత్తూరు పోలీసుశాఖ రూపొందించిన ‘చాట్‌బోట్’ సాఫ్ట్‌వేర్ ద్వారా రూ.45 లక్షలు విలువ చేసే సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 200 పైగా సెల్‌ఫోన్లను బాధితులకు పోలీసులు అందచేశారు. గురువారం చిత్తూరు పోలీసు అతిథిగృహంలో ఏఎస్పీ సుధాకర్, సీసీఎస్ సీఐ భాస్కర్, ఉమామహేశ్వర్‌తో కలిసి మీడియాకు వివరాలను వెల్లడించారు. ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చిత్తూరు పోలీసుశాఖ రూపొందించిన చాట్‌బోట్ సాఫ్ట్‌వేర్ ద్వారా సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు వివరాలు నమోదు చేస్తే దేశంలో ఎక్కడున్నా సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా, ఫిర్యాదు ఇవ్వకుండా చాట్‌బోట్ ద్వారా ఇంట్లో కూర్చుని వివరాలిస్తే బాధితులకు నేరుగా ఫోన్ వచ్చి చేరుతుందన్నారు. తొలి విడతలో రూ.కోటి విలువ చేసే 500 పైగా మొబైళ్లను ఇప్పటికే రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. చిత్తూరు సీసీఎస్ పోలీసులతో పాటు టెక్నికల్ అనాలసిస్ వింగ్ ఇన్‌చార్జ్ దేవరాజులు బృందం ఇందులో సమర్థవంతంగా పనిచేసిందన్నారు. అలాగే దేశంలో ఎక్కడ మొబైల్ పోగొట్టుకున్నా సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (www.ceir.gov.in)లో లాగిన్ అయ్యి.. వివరాలు నమోదుచేస్తే సెల్‌ఫోన్లు కనిపెట్టి ఇప్పిస్తారని ఎస్‌ఐ ఉమామహేశ్వర్ తెలిపారు.

జెడ్పీ సీఈఓపై ఆరోపణలు అవాస్తవం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం నాయకులు

చిత్తూరు రూరల్: కొందరు కక్షకట్టి జెడ్పీసీఈఓ ప్రభాకర్‌రెడ్డిపై అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం స్పష్టంచేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జెడ్పీ సీఈఓను కొందరు దొంగ చాటుగా దెబ్బ తీయాలని చూస్తున్నారన్నారు. ఆయన బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆకాశరామన్న ఉత్తరాలతో భయపెట్టాలనుకుంటున్నారని తెలిపారు. ఆకాశరామన్న ఉత్తరాల్లోని అంశాలన్నీ అవాస్తవాలని పేర్కొన్నారు. పాత కక్షలు, జెడ్పీ సీఈఓ స్థానాన్ని జీర్ణించుకోలేని వ్యక్తులు ఈ కుతంత్రాలకు పాల్పడుతున్నారన్నారని.. జెడ్పీ నుంచి గతంలో జరిగిన పనుల బిల్లుల విషయంలో అడ్డుపడ్డారనే కారణం చూపి కొందరు ఈ ఆకాశరామన్న ఉత్తరంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రభాకర్‌రెడ్డి విధుల్లో పారదర్శకంగా ఉంటూ సమస్యల పరిష్కారంలో తక్షణం స్పందిస్తున్నారని తెలిపారు. సమావేశంలో సభ్యులు మురళి, ప్రభుకుమార్, మహేష్, నాగరాజు, పరంజ్యోతి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత ఉద్యోగులుగా 632 మంది లైన్‌మెన్లు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో సచివాలయ పరిధిలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్ (జేఎల్ఎం గ్రేడ్–2)లను శాశ్వత ఉద్యోగులుగా తీసుకుంటూ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు గురువారం ఆదేశాలు జారీ చేశారు. సచివాలయ పరీక్షలో ఎంపికైన జేఎల్ఎం గ్రేడ్–2 ఉద్యోగులు అక్టోబర్ 2019లో రూ.15 వేల జీతంతో విధులకు చేరారు. వీరు ట్రాన్స్‌కో పర్య వేక్షణలో ఉంటూ సచివాలయాల్లో పనిచేస్తున్నారు. జూలై 2022న వీరికి టైం స్కేల్ ఫిక్స్ చేసి బేసిక్ వేతనంగా రూ.22,460, ఇతర భత్యాలను చెల్లిస్తున్నారు. తమను శాశ్వత ప్రతిపాదికన తీసుకోవాలని గతంలో వీరు నిర సన కార్యక్రమాలు చేపట్టారు. గత 5 రోజులుగా పలు డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్న విషయం తెలిసిందే. దీంతో వీరిని శాశ్వత ప్రతిపాదికన తీసుకుంటూ ఉత్తర్వులు వచ్చాయి. ఈ ఆదేశాల మేరకు వారు అందుకుంటున్న భత్యాలతో పాటు అదనంగా ఫ్యామిలీ మెడికల్ బెనిఫిట్స్ కూడా పొందనున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 632 మంది జేఎల్ఎం గ్రేడ్–2 ఉద్యోగులు ఉన్నారు. దీనిపై ఉద్యోగుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి

చిత్తూరు రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రభావతిదేవి ఆదేశించారు. గురువారం డీఎంఅండ్‌హెచ్ కార్యాలయంలో గురువారం ఆమె మలేరియా నివారణాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో దోమల ఉధృతి పెరిగి.. విషజ్వరాలతో పాటు డెంగీ వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. నీటి నిల్వలు, దోమల ఉత్పత్తికి నిలయంగా ఉన్న కుంటలపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలన్నారు. డెంగీ, జ్వర పీడితులు, లక్షణాలు ఉన్నవారిని గుర్తించి తగిన పరీక్షలు చేయించాలన్నారు. డీఎంఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ అందజేసే నేషనల్ ఫెలోషిప్ స్కాలర్‌షిప్‌లకు అర్హులైన గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023–24 విద్యాసంవత్సరంలో గిరిజన విద్యార్థుల ఉన్నత విద్యకు నేషనల్ ఫెలోషిప్ స్కాలర్‌షిప్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ ఎంఫిల్ చేస్తున్న గిరిజన విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా www.fellowship.tribe.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

జర్నలిస్టులు విలువలు పాటించాలి


మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస్

కుప్పం: జర్నలిస్టులు విలువలు పాటించాలని, తద్వారా సమాజ శ్రేయస్సు జరుగుతుందని ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం కుప్పం పర్యటనకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. మీడియా రంగం రాను రానూ ఓ వర్గానికి మద్దతుగా నిలుస్తోందని, ఇది ఏమాత్రం మంచిది కాదన్నారు. జర్నలిస్టులు విలువలతో పని చేయాలన్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా వాస్తవాలను రాయాలని తెలిపారు. మంచి విషయాలను చిన్నదిగా రాయడం, చెడును పెద్దదిగా చూపే ధోరణులను మానుకోవాలన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ పులివెందుల..

తాను ప్రెస్ అకాడమీ చైర్మన్ అయిన తరువాత రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను సందర్శించానని, రెండు రోజుల కిందట పులివెందుల సందర్శించానని, అక్కడ దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి అద్భుతంగా ఉందని శ్రీనివాస్ తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నగరవనం, బస్టాండు, రింగ్ రోడ్డు, కడప నుంచి పులివెందులకు రోడ్ డివైడర్లు, జేఎన్‌టీయూ, ప్రభుత్వం ఇంజినీరింగ్, మెడికల్, పాలిటెక్నిక్ కళాశాలలు తెచ్చి అభివృద్ధి చేశారన్నారు. కేవలం రాజశేఖరరెడ్డి 6 ఏళ్లు, కరోనా పోగా జగన్‌మోహన్‌రెడ్డి రెండేళ్లలో ఎంత అభివృద్ధి చేశారని తెలిపారు. అదే కుప్పం చూసినప్పుడు ప్రైవేట్ కళాశాలలు కనబడుతున్నాయన్నారు. దురదృష్టం ఏమిటంటే 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఇళ్లు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత కుప్పంలో పేదలకు పెద్దఎత్తున గృహాలు ఇచ్చారని తెలిపారు. ఇలాంటి వాస్తవాలను గుర్తించి విలేకరులు కథనాలు రాయాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. విలేకరులకు విలువలే ముఖ్యమన్నారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.